ప్రజాశక్తి
శుక్రవారం 24 అక్టోబర్ 2025
5
శ్రీ సత్యసాయి

జడివాన

ఉమ్మడి జిల్లాలో తేలికపాటి వర్షాలే

ప్రజాశక్తి -అనంతపురం

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో మంచి వర్షాలు పడుతుంటే అనంతపురం ఉమ్మడి జిల్లాలో మాత్రం జడివాన కురుస్తోంది. మేఘాలు దట్టంగా ఉంటున్నప్పటికీ తేలికపాటి వర్షాలే పడుతున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో జడివానే ఉంటోంది. గురువారం రోజు అనంతపురం జిల్లా వ్యాప్తంగా 15 మిల్లీమీటర్ల సగటుతో వర్షపాతం నమోదయింది. మండలాల వారీగా చూస్తే బ్రహ్మసముద్రంలో అత్యధికంగా 65.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. కళ్యాణదుర్గంలో 58.4 మిల్లీమీటర్లు, శెట్టూరులో 47.4మిల్లీమీటర్లు, గుమ్మగట్టలో 38.4 మిల్లీమీటర్లు, కంబదూరు 28.4 మిల్లీమీటర్లు, యాడికి, యల్లనూరు 24.4 మిల్లీమీటర్లు, గుత్తిలో 22.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. తక్కిన మండలాల్లో తేలికపాటి చిరు జల్లులే పడ్డాయి.

ఇక శ్రీసత్యసాయిజిల్లాలో బుధవారం కురిసిన వర్షానికి 434.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కనగానపల్లి మండలంలో 29.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా నల్లమాడలో 28.0, తాడిమర్రిలో 25.0, ఎన్‌పి కుంటలో 22.4, సికె. పల్లెలో 20.8, రొద్దంలో 20.4, కదిరిలో 18.4, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యల్పంగా పరిగిలో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలోని మొత్తం 32 మండలాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది.

రబీలోనూ సాగు లేదు...

ఖరీఫ్‌లోనూ తక్కువే..
ప్రభుత్వ తోడ్పాటు కరువు

ప్రజశక్తి -అనంతపురం ప్రతినిధి

రబీ సీజన్ లోనూ సాగు మందగమనంగా ఉంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జల్లాలో పంట సాగు నిరాశాజనంగా సాగింది. రబీలో ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో ఐదు శాతమే పంటలు సాగయ్యాయి. ఇక సత్యసాయి జిల్లాలో రెండు శాతమే సాగైంది. సీజన్ ఆరంభమై ఇప్పటి వరకు రబీలో సాగయ్యే ప్రధాన పంట పప్పుశనగకు సబ్సిడీ విత్తనాన్ని రైతులకు అందజేయలేదు. ఇప్పటికే విత్తన అందజేసి ఉంటే ఈ వర్షాల్లోనైనా సాగు విస్తీర్ణం కొంత వరకు పెరగడానికి అవకాశముండేది. అనంతపురం జిల్లాలో రబీలో 3.12 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఇప్పటి వరకు 14099 ఎకరాల్లోనే పంట సాగైంది. అంటే ఐదు శాతం లోపే అనంతపురం జిల్లాలో రబీలో పంటలు సాగయ్యాయి. ఇక సత్యసాయి జిల్లాలో రబీలో సాగయ్యేదే చాలా తక్కువ . 80 వేల ఎకరాల్లోనే రబీలో పంటలు సాగవుతాయి. కాని ఇప్పటి వరకు అయింది 1771 ఎకరాల్లోనే మాత్రమే. అంటే రెండు శాతంలోపే ఉంది. పంటల వారీగా చూస్తే రబీలో ప్రధాన పంట పప్పుశనగ నల్లరేగడి నేలలున్నా ప్రాంతాల్లోనే సాగవుతుంది. ఈ పంట చూస్తే రబీలో అనంతపురం జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సుంది. కాని ఇప్పటి వరకు సాగైంది 14 వేల ఎకరాల్లోనే. సత్యసాయి జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా పది ఎకరాల్లో మాత్రమే పంట వేశారు. నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ పంటను సాగు చేస్తారు. దీని సాగు విస్తీర్ణం చూస్తే అనంతపురం జిల్లాలో 45 వేల

ఎకరాలకుగానూ ఇప్పటివరకు 20 ఎకరాల్లో సాగైంది. సత్యసాయి జిల్లాలో 45 వేల 555 ఎకరాలకుగానూ 407 ఎకరాల్లో విత్తనం పడింది. వరి అనంతపురంలో 15 వేలు, సత్యసాయిలో 3041 ఎకరాలకుగానూ ఒక్క ఎకరంలోనూ విత్తనం పడలేదు. మొక్కజొన్న పంట అనంతపురం జిల్లాలో 20 వేల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా 111 ఎకరాల్లో సాగైంది. సత్యసాయి జిల్లాలో పది వేల ఎకరాలకుగానూ 227 ఎకరాల్లో విత్తనం వేశారు. ఇవి ప్రధాన పంటల పరిస్థితి. ఇవి కాకుండా ఇతర పంటలు కూడా ఇదే రకంగా రబీలో సాగయ్యాయి.

ఖరీఫ్‌లోనూ ఇదే పరిస్థితి

ఖరీఫ్ సీజన్‌లో ఈ ఏడాది సాగు ఆశించినంత జరగలేదు. ఖరీఫ్‌లో ఈ ఏడాది 9.78 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాలన్నది లక్ష్యం. అయితే సాగైంది 6.03 లక్షల ఎకరాల్లోనే అంటే 71 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇంకా సుమారు 3.75 లక్షల ఎకరాలు బీడుగా ఉండిపోయింది. ఇక సత్యసాయి జిల్లాలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇక్కడ ఖరీఫ్‌లో 7.54 లక్షల ఎకరాలకుగాను 2.14 లక్షల ఎకరాల్లో సాగైంది. అంటే 39శాతం మాత్రమే సాగైంది. 5.40 లక్షల ఎకరాలు బీడుగా ఉండింది.

పకృతి, ప్రభుత్వ తోడ్పాటు కరువు : ఈ రెండు సీజన్‌లో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోవడానికి ప్రధాన కారణం ప్రకృతి తోడ్పాటు లేకపోవడంతో ప్రభుత్వ సహకారం లేకుండా పోయిందన్న విమర్శ ఉంది. ఖరీఫ్‌కు కీలకమైన జూన్, జులై మాసాల్లో తీవ్ర వర్షాభావం ఉంది. ఇది రెండు జిల్లాల్లోనూ నెలకొంది. ఆగస్టులో అధిక వర్షాలు పడ్డాయి. అయితే సాగుకు అనువైన జులైలో వర్షం లేకపోవడంతో ప్రధాన పంట వేరుశనగ సాగు చేయలేకపోయారు. అదును దాటక ఆగస్టులో వర్షాలొస్తే ఆ సమయంలో ప్రభుత్వం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాన్ని ఇచ్చే ప్రయత్నం చేయలేదు. దీంతో సాగు విస్తీర్ణం ఆశించినంత పెరగలేదు. ఇక రబీలోనూ సెప్టెంబరు, అక్టోబరు మాసంలో తిరిగి వర్షాభావం నెలకొంది. దీంతో రబీ సాగు ముందుకు సాగడం లేదు. కనీసం పప్పుశనగ విత్తనాన్ని ఇప్పటి వరకు అందజేయలేదు. ఇప్పటికి పంపిణీ చేసి ఉంటే ఈ రబీలోనైనా రైతులు పంటలు సాగు చేసుకునేందుకు వీలుండేది. మొత్తంగా ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

జెసి వ్యాఖ్యలు సరికాదు

స్పందించిన డిఐజి
చట్టపరమైన చర్యలుంటాయన్న ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి ఎస్పీ రోహిత్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను డిఐజి డాక్టర్ షిమోసి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తాము ఆల్ ఇండియా సర్వీసు సభ్యులమై దేశ సేవ చేయడమే ప్రధాన ధ్యేయంగా ఉంటామని తెలిపారు. కులం, మతం, ప్రాంత తేడాలు తమ సేవా ధోరణిలో ఏ మాత్రం ప్రభావం చూపవన్నారు. తమపై చేసిన వ్యాఖ్యలు తమ విధి నిర్వహణలో ఎటువంటి ఆటంకం కలిగించవన్నారు. తమ నిబద్ధత, మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని చెప్పారు. ఒక ఐపిఎస్ అధికారిని అవమానకర భాషలో సంబోధించడం పరిపాలనా ప్రమాణాలకు విరుద్ధమని హెచ్చరించారు. పోలీసు శాఖ ప్రజా శాంతి భద్రత, చట్ట స్వతంత్ర కాపాడటానికి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ విధమైన వ్యాఖ్యలు తమ సేవాభావం, నిబద్ధతను ఏ మాత్రం ప్రభావితం చేయబోవన్నారు. తమ విధులను నిబద్ధతతో, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామన్నారు.

జెసి వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు : ఎస్పీ జగదీష్

జెసి ప్రభాకర్‌రెడ్డి ఎఎస్పీపై చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా నేరమైనవని, వాటిపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు విధులు నిర్వహిస్తూ ఉన్నారన్నారు. అది కూడా పోలీసు అమవీరుల దినోత్సవంలో పాల్గొని వారి సేవల గురించి వీలైతే నాలుగు మంచి మాటలు చెప్పాల్సిందిపోయి ఈరకమైన వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ఒక అధికారిని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం తగదన్నారు. ఇది చట్టపరంగానూ నేరమన్నారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'మా వద్దకూడా గన్ ఉందని' చెప్పిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ అవసరమైతే ఆయన గన్ లైసెన్సు రద్దు చేయడంపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్పీని కలిసేందుకు జెసి ప్రయత్నం

తాడిపత్రిలో ఎఎస్పీ రోహిత్‌కుమార్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వడానికి తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి గురువారం అనంతపురం విచ్చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసేందుకు ఆయన ప్రయత్నించారు. గంటకుపైగా వేచి ఉన్నా ఎస్పీ అపాయింట్ లేకపోవడంతో ఆయన వెనుదిరిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో డిఐజి, ఎస్పీలు మీడియాతో పై విధంగా స్పందించడం గమనార్హం.

కౌన్సిలర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ షాజియా ప్రమాదంలో గాయపడి, పట్టణంలోని తేజ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణురెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి షాజీయాను పరామర్శించారు. ఆమె వెంట రాష్ట్ర బూత్ కమిటీల సహాయ కార్యదర్శి వరుణ్‌రెడ్డి, నాయకులు నవీన్, శబరీష్‌రెడ్డి, సలాం, అయూబ్, రంగారెడ్డి, బాబ్‌జాన్, సూరి, వేణుగోపాల్‌రెడ్డి, హరి ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

సినీ హీరో ప్రభాస్ జన్మదినం సందర్భంగా హిందూపురం రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ముదిరెడ్డిపల్లిలోని రూపశ్రీ ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువతేజ, సాయిచరణ్, రవి, నితిన్, వినయ్, మంజునాథ్, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ ఛైర్మన్ డిఇ. రమేష్ కుమార్

వార్డులో నెలకొన్న సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవతో త్వరలో విడుదల కానున్న రూ. 92 కోట్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. వార్డుల పర్యటనలో భాగంగా గురువారం ఆయన మార్కండేయనగర్, మేడాపురం ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రధానంగా రోడ్ల సమస్య ఉందని, వర్షాల కారణంగా రోడ్లు బురదమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు తెలిపారన్నారు. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే రహదారులు, కాలువల నిర్మాణం చేపడతామని తెలిపారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా నిలబెట్టేందుకు పట్టణ ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్ నాగమణి, మహమ్మద్ అమీన్, నాయకులు నజీర్, నూర్, జనసేన నాయకులు నాగభూషణ్, ఏఈ శంకర్, అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దళితుల భూములు అన్యాక్రాంతం కానివ్వం

ప్రజాశక్తి-హిందూపురం

దళితుల భూములు ఎక్కడా అన్యాక్రాంతం కానివ్వమని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు రామంజప్ప తెలిపారు. రూరల్ మండలంలోని గోళాపురంలో దళితుల భూములు అన్యాకాంతం అయినా విషయాన్ని తెలుసుకున్న ఆయన గురువారం ఆ భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఏటా పంట సాగు చేస్తున్న భూమిని రెవెన్యూ అధికారులు బిసి సామాజిక వర్గానికి చెందిన వారి పేరుపై అడంగల్ చేయడం దుర్మార్గమన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, దళితుల భూములు వారికే అందేలా చూస్తామన్నారు. ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయం

కోటి సంతకాల సేకరణలో వైసిపి సమన్వయకర్త

ప్రజాశక్తి-హిందూపురం

నూతన వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి, వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు చైతన్య, జిల్లా అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలోని సద్భావన్ సర్కిల్‌లో వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 వరకూ 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,550 మెడికల్ సీట్లు మాత్రమే ఉండేవన్నారు. జగన్ సిఎం అయ్యాక 4,500 మెడికల్ సీట్లు పెంచేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా రూ. 8 వేల కోట్లతో 17 వైద్య కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. 2023–24లోనే 5 వైద్య కళాశాలలను ప్రారంభించారని గుర్తు చేశారు. పులివెందుల, పాడేరు వైద్య కళాశాలల నిర్మాణాలు వైసిపి హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన కళాశాలలకు సంబంధించి స్థలాల కేటాయింపుతో పాటు నిర్మాణాలు 30 నుంచి 70శాతం పూర్తయ్యాయన్నారు. పెనుకొండలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ వైద్య కళాశాలలు అందుబాటులోకి వస్తే వాటికి అనుబంధంగా బోధనా ఆసుపత్రులు వచ్చి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పిపిపిని తెరపైకి తెచ్చిందన్నారు. ఇది అమలైతే పేద విద్యార్థులు వైద్యులు కావాలన్న కల కలగానే మిగిలిపోవడంతో పాటు వైద్యాన్ని కూడా కొనాల్సి వస్తుందన్నారు. ప్రజలకు నష్టం చేయాలని చూస్తే ఊరుకోమని, కలిసికట్టుగా ప్రభుత్వం మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రులను కూడా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకు ఫయాజ్‌బాషా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జిబివుల్లా, బలరామిరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మధుమతిరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేంద్రరెడ్డి, నాయకులు మనోజ్, కదిరేష్, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన దీపిక : వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు చైతన్యను పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి దీపికా వేణు రెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్ ఫయాజ్‌బాషా, నాయకులు వేణురెడ్డి, మధుమతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, కదిరిష్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న దీపికా వేణురెడ్డి

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అవుతోంది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నా వేలాది రూపాయలు వెచ్చించి అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. కొన్ని భవనాలు నిరుపయోగంగా ఉండడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత తమదికాదన్న ధోరణిలో అధికారులు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలు నియోజకవర్గంలో పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి.

ప్రజాశక్తి-పెనుకొండ

నిర్వహణ లేక శిథిలావస్థలోకి..
కొద్దిపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి..
పట్టించుకోని పాలకులు, అధికారులు

నియోజకవర్గ కేంద్రంలో హాస్టల్ భవనం, పాత ఎంపిడిఒ, ఆడిట్ కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఎస్టీ హాస్టల్ భవనంలో గతంలో ఐదవ సచివాలయం నిర్వహించేవారు. హాస్టల్ రూపురేఖలు మార్చి వినియోగంలోకి తీసుకురావాలని సచివాలయాన్ని మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో అసంపూర్తి నిర్మాణంతో ఉన్న సచివాలయ భవనంలోకి మార్చారు. మండల అభివృద్ధి కార్యాలయం పాడుబడిందని నూతన కార్యాలయాన్ని నిర్మించి అందులోకి మార్చారు. పాత భవనం మరమ్మతులు చేయించి అతిథిగృహంగా మార్చాలని రూ. 25 లక్షలు మంజూరు చేశారు. కార్యాలయ భవనానికి ఉన్న పైకప్పును తొలగించి కేవలం టాపు మాత్రమే వేసి అసంతృప్తిగా వదిలేశారు. దీంతో ఆ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి బూత్ బంగ్లాగా మారిపోయింది. ఇదే ఆవరణలో ఉన్న మరో కార్యాలయంలో డివిజనల్ ఆడిట్ విభాగానికి సంబంధించిన కార్యాలయం ఉండేది. ఆడిట్ కార్యాలయం మార్చడంతో ఆ భవనం ఖాళీగా ఉంది. కొద్దిపాటి మరమ్మతులు చేసి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావచ్చు. సంబంధిత అధికారులు మాత్రం ఆ ఆలోచన చేయకుండా భవనాన్ని వదిలివేయడంతో అది శిథిలావస్థకు చేరుకొని టాపు కూలిపోయే పరిస్థితికి చేరుకుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయాల భవనాల నిర్మాణాలు చాలా వరకు పూర్తి అయ్యాయి. కాంట్రాక్టర్ కు బిల్లులు రాక కొన్నిచోట్ల చిన్న చిన్న పనులు వదిలి వేశారు. ఆ భవనాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపడం లేదు.

ఉద్యోగుల కోటర్స్ లో డిడిఒ కార్యాలయం

ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన కోటర్స్‌లో డిడిఒ కార్యాలయం ఏర్పాటు చేశారు. అదే ఆవరణలో నిరుపయోగంగా ఉన్న భవనాలను మరమ్మతులు చేసి డిడిఒ కార్యాలయంగా ఉపయోగించుకునే అవకాశం ఉంది. అందుకు అధికారులు ఏమాత్రం చొరవ చూపకుండా కోటర్స్‌లోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

నిరుపయోగంగా సంక్షేమ వసతిగృహం : నియోజకవర్గ కేంద్రంలో అగ్నిమాపక కార్యాలయం సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ వసతిగృహం నిరుపయోగంగా ఉంది. లక్షల రూపాయల విలువ చేసే ఈభవనాలు కొద్దిపాటి మరమ్మతులు చేపట్టినా వినియోగంలోకి వస్తాయి. మహిళల సంక్షేమ హాస్టల్ పట్టణంలో ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ వసతిగృహానికి మరమ్మతులు చేపట్టి అందులోకి మార్చు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. అధికారులు మాత్రం ఇవి మనవి కాదన్న రీతిలో వ్యవహరిస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఉన్న సచివాలయ భవనంలో మూడు సచివాలయాలు ఉన్నాయి. అదేవిధంగా నగర పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశ భవనంలో రెండు సచివాలయాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడే నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయ భవనాన్ని నగర పంచాయతీ అధికారులు సమావేశ భవనంగా మార్చుకొని వినియోగిస్తున్నారు. గతంలో ఐదవ సచివాలయం గిరిజన హాస్టల్ భవనంలో ఉండేది. నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం వద్ద నిర్మాణం పూర్తి అయిన సచివాలయ భవనం వినియోగంలో లేక భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలచి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఇవే కాక మండలంలోని మునిమడుగు ఆడదాకులపల్లి రాంపురం తదితర పంచాయతీల్లో సచివాలయ భవనాల నిర్మాణాలు అసంతృప్తిగా నిలిచిపోయాయి. ఇలా ప్రభుత్వ భవనాలకు ఆలనా పాలన కరువవడంతో శిథిలావస్థకు చేరాయి.

ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలి

ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు కొన్ని కారణాలతో మూతపడ్డాయి. ఆ భవనాలను అలాగే వదిలేయకుండా ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించాలని పలువురు కోరుతున్నారు. ఉన్న భవనాలను అలాగే వదిలేస్తే శిథిలమడం తప్ప ఏ మాత్రం ఉపయోగపడవని, దీనిని వృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ శాఖల సమన్వయంతో వాటిని ఉపయోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మూతపడిన డివిజనల్ ఆడిట్ కార్యాలయ భవనం

బూత్‌బంగ్లాను తలపిస్తున్న పాత ఎంపీడీవో కార్యాలయ భవనం

ప్రజాశక్తి
www.prajasakti.com

సిజి ప్రాజెక్టులో జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

సిజి ప్రాజెక్ట్‌లో ఎమ్మెల్యే జలహారతి

ప్రజాశక్తి-తనకల్లు

ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు మండలంలోని సిజి ప్రాజెక్ట్ పూర్తిగా నిండడంతో గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అలాగే ప్రాజెక్టులో జల హారతి ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పెద్దఎత్తున వరద నీరు చేరి సిజి ప్రాజెక్ట్ జలకళ సంతరించుకుందన్నారు. ఈ ఏడాది మండలంలో భూగర్భ జలాలకు కొదవ లేదన్నారు. బోరు బావులు నీటితో పుష్కలంగా ఉండి రైతుల పంటలకు నీరు సమృద్ధిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మన్ రామ్మోహన్, ఎస్ఐ గోపి, టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, నాయకులు కావడి ప్రవీణ్‌కుమార్, సోంపాల్యం నాగభూషణ, రాజారెడ్డి, మల్లికార్జున, సరోజమ్మ, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : అర్హులైన ప్రతి ఆటో కార్మికుడిని ఆదుకుని అండగా నిలుస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భరోసా కల్పించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి ఇళ్ల పట్టా ఇప్పించి పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఆటోనగర్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఆటో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

చలో రాజధాని కరపత్రం విడుదల చేస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, నాయకులు

20న చలో రాజధాని

ముదిగుబ్బ : ప్రవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 20వ తేదీ నిర్వహించతలపెట్టిన 'చలో రాజధాని' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ముదిగుబ్బలో 'చలో రాజధాని' కరపత్రాన్ని విడుదల చేశారు. ఓబులు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ఒకే క్యాడర్ ఒకే వేతనం అమలు చేయాలని, డిస్కంల ప్రైవేటీకరణ ఆపాలని, సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వైద్య కోసం రూ. కోటి ఇన్సూరెన్స్ కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, సిపిఎం నాయకులు పెద్దన్న, ఆవాజ్ నాయకులు బాబ్‌జాన్, పక్కీరప్ప, తదితరులు పాల్గొన్నారు.

గోవులను ప్రమాదాల నుంచి రక్షించండి

కదిరి టౌన్ : పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న ఖాద్రీ లక్ష్మీనృసింహ స్వామి స్వామి ఆలయానికి చెందిన గోవుల కోసం గోశాల నిర్మించి, వాటిని అందులోకి తరలించాలని శ్రీఖాద్రీ లక్ష్మీనృసింహస్వామి సేవా సమితి సభ్యులు లక్ష్మణ కుటాల కోరారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిత్యం ఎక్కడో ఓ చోట గోవులు రోడ్డు ప్రమాదాలకు గురై గాయపడుతున్నాయని, ఒక్కో సందర్భంలో ప్రాణాలు సైతం కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కాలేజీ సర్కిల్‌లో గురువారం గుర్తు తెలియని వాహనం ఓ ఎద్దును ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో ఇబ్బంది పడుతున్న ఎద్దును సేవా సమితి సభ్యులు వెంటనే స్థానిక పశువైద్యశాలకు తరలించగా అక్కడి వైద్య సిబ్బంది ఎద్దుకు చికిత్స చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పట్టణంలో ఒక గోశాల ఏర్పాటు చేసి, రోడ్లపై సంచరించే గోవులను గోశాలకు తరలించాలని లక్ష్మణ్, తదితరులు కోరారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ (టిటి) పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం

టిటి పోటీలకు 'జీవన జ్యోతి' విద్యార్థుల ఎంపిక

ధర్మవరం రూరల్ : పట్టణంలోని జీవనజ్యోతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ (టిటి) పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుజాత తెలిపారు. ఈ నెల 7వ తేదీ అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. అండర్-17 విభాగంలో ఎస్.ఐశ్వర్య, ఎస్.అతిక, అండర్-19 విభాగంలో ఎస్.అక్షిత, ఎస్.జుహాతబుసుమ్ ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

బత్తలపల్లి : వాహనాలు నడిపేటప్పుడు చోదకులు ట్రాఫిక్ రూల్స్ సరిగా పాటిస్తే ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చునని ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ తెలిపారు. ఆయన పోలీసు సిబ్బందితో కలిసి గురువారం సాయంత్రం గుమ్మళ్లకుంట టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులను ఆపి రికార్డులను సరిచూశారు. రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా

గుడిబండ : తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం మండలంలోని కూగిర్నపాలెం గ్రామస్తులు మడకశిర-గుడిబండ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మహిళలు మాట్లాడుతూ గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. రెండు బోర్లు వేసినా అందులో నీళ్లు లభ్యం కాలేదన్నారు. దీంతో అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేవారన్నారు. కొన్ని రోజులుగా ట్యాంకర్లను కూడా నిలిపివేయడంతో తాగునీటి కోసం వ్యవసాయ బోర్లు, బావులను ఆశ్రయించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాతో ఈ మార్గంలో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. స్పందించిన పంచాయతీ కార్యదర్శి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు.

27న అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మండలంలోని బేగార్లపల్లిలో ఈ నెల 27వ తేదీ చేపట్టనున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. ఈ విషయంపై గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 15 మంది ఎమ్మెల్యేలు, ఎంపిలు హాజరవుతారన్నారు. కావున కూటమి పార్టీల శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు విగ్రహాల ఏర్పాటుకు బేగార్లపల్లి వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహరాజు, కౌన్సిలర్లు, టిడిపి మండల కన్వీనర్లు, నాయకులు ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న గుండుమల, నాయకులు

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రైతులకు ఎరువులను ఎంఆర్‌పికే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పిఎం ధన ధాన్య కృషి యోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ పథకం అమలుపై గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి సేద్యం పద్ధతులను రైతులకు వివరించే ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకుని సమావేశాలు ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడుతున్న గ్రామాలను గుర్తించి అధిక ఎరువుల వినియోగించడాన్ని కట్టడి చేయాలన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల లావాదేవీలు, అమ్మకాలు రోజువారీగా దుకాణదారుల నుంచి వివరాలు ఆన్‌లైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాబా శతజయంతి ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తనివ్వొద్దు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్, కమిషనర్

నవంబర్‌లో జరిగే సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కౌన్సిలర్లు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురు వారం ఛైర్మన్ తుంగ ఓబుళపతి ఆధ్వర్యంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సి పాలిటీలో చేపట్టనున్న సీసీ రహదారులు, వీధి లైట్లు, తాగునీరు, తదితర అంశాలపై చర్చించారు. కౌన్సిలర్ సూర్యగౌడ్ మాట్లాడుతూ పెద్దబజారులోని నాగులకట్ట వద్ద సీసీ రహదారి పనులను ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పనులు పూర్తి చేయడంలో జేఈ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బీడుపల్లి కౌన్సిలర్ జయప్ప మాట్లాడుతూ తమ వార్డులో కొన్నేళ్లుగా వీధిలైట్లు, తాగునీటి సమస్యలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కమిషనర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. బాబా శతజయంతి ఉత్సవాలకు మున్సిపాలిటీ పరిధిలో అన్ని పనులు చేపడతామన్నారు. సమావేశంలో ఆర్ఐ నరసింహులు, ఏఈ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పంచాయతీలు విలీనం చేయొద్దు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామాల ప్రజలు

ధర్మవరం రూరల్ పరిధిలోని గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలోకి విలీనం చేయాలనే ప్రక్రియను తక్షణమే ఆపాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయా గ్రామాల ప్రజలు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయతీలను మున్సిపల్ పరిధిలోకి విలీనం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోమని తెగేసి చెప్పారు. టిడిపి నాయకులు మహేష్ చౌదరి మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయం, దిన కూలీపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు ఇంటి, నీటి, ఇతరత్రా పన్నులు చెల్లించలేరన్నారు. గ్రామాల విలీన ప్రక్రియకు హేతుబద్ధత కూడా లేదన్నారు. ముఖ్యంగా రూరల్ గ్రామాలను మున్సిపాలిటీలోకి విలీనం చేయడాన్ని ఆయా గ్రామా ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారని కావున తక్షణమే విలీన ప్రక్రియను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో పోతులనాగేపల్లి, తుంపర్తికాలనీ, రేగాటిపల్లి పంచాయతీ, రేగాటిపల్లి కాలనీ, కునుతూరుకాలనీ, పోతుకుంట గ్రామపంచాయతీ, పోతుకుంట బీసీ కాలనీ, తదితర గ్రామాల ప్రజలు ఉన్నారు.

కాటికోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని చిల్లవారిపల్లి గ్రామ పరిధిలో వెలసిన శ్రీకాటికోటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం హుండీ లోని కానుకలను గురువారం దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో పోలీస్‌ల పర్యవేక్షణలో లెక్కిం చారు. అందులో రూ. 9,07,663 ఉండగా నార్పల మండలం గూగూడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో దేవాదాయ శాఖ ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి బిఆర్.వెంకటేశులు, సిఐ శ్యామ్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి, టిడిపి మండల కన్వీనర్ కూచి రాము, రాజశేఖర్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, సాయిప్రసాద్, హర్ష రమణ, భాస్కర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

టెంకాయలు, పూజ సామగ్రి, గాజులు, బొమ్మల విక్రయం, తలనీలాల సేకరణ హక్కులకు శుక్రవారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అధికారి బిఆర్. వెంకటేశులు తెలిపారు. కొన్ని కారణాలతో ఈ వేలం ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. దీంతో శుక్రవారం అధికారుల సమక్షంలో పోలీసు భద్రత మధ్య బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఆశావహులు నిర్భయంగా పాల్గొనవచ్చని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి-గోరంట్ల

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడుతామని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఎస్పీ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి త్వరలోనే చర్యలు చేపడతామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిఘా పెంచాలన్నారు. ఎస్పీ వెంట సిఐ శేఖర్, ఎస్ఐ రామచంద్ర, సిబ్బంది ఉన్నారు.

డైట్ కాలేజీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక ప్రభుత్వ డైట్ కాలేజీలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులకు డిప్యుటేషన్ ద్వారా బోధించుటకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాదపో ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి కాంట్రాక్ట్ పద్ధతిన బోధించుటకు ప్రభుత్వ జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు(58 ఏళ్ల లోపు) ఈ నెల 29వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల అనుభవం కలిగి, సంబంధిత సబ్జెక్టులో మాస్టర్ డిగ్రీతో పాటు తెలుగు, ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను హెచ్‌ఎం, ఎంఇఒల ద్వారా అనంతపురం డిఇఒ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

పులమతి పంచాయతీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని పులమతి పంచాయతీ నూతన కార్యదర్శిగా విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఎంపిడిఒను మర్యాద పూర్వకంగా కలిశారు.

విద్యార్థులకు జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి ఆధ్వ ర్యంలో విద్యార్థులకు జిఎస్‌టి 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలు, దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమం లో కామర్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు హుమయూన్, శశిధర్‌రెడ్డి, నవీన్, బాబు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేపట్టిన ఎన్‌టిఎ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఎన్‌టిఎ

ప్రజాశక్తి-తనకల్లు

సకాలంలో పిఆర్‌సి, డిఎ, అరియర్స్, సరెండర్ లీవులు మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టిఎ) నాయకులు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. తనకల్లులో గురువారం ఎంఇఒ లలితమ్మ చేతుల మీదుగా ఎన్‌టిఎ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక మోడల్ ప్రైమరీ స్కూల్, నల్లగుట్లపల్లి, బొంతలపల్లి, చీకటిమానుపల్లి, మార్పుడివాండ్లపల్లి, ముత్యాల వాండ్లపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎన్‌టిఎ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.శివశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో పిఆర్సి, డిఎ, అరియర్స్, సరెండర్ లీవులు మంజూరు చేయాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎ పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

ధర్మవరం రూరల్ : పంటల సాగులో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రామసుబ్బయ్య, ధర్మవరం డివిజన్ వ్యవసాయ అధికారి లక్ష్మానాయక్ సూచించారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో రైతులు సాగు చేసిన కంది పంటను గురువారం వారు పరిశీలించా రు. మొగ్గ, పూత, కాయ దశలో వాడాల్సిన, తెగుళ్ల నివారణకు మందులను సూచించారు. వారి వెంట మండల అధికారి ముస్తఫా, రైతు సేవా కేంద్ర సిబ్బంది శిరీష, మీనా, రైతులు ఓబిరెడ్డి, ఆనంద్, తదితరులు ఉన్నారు.

ఎస్ఐను కలిసిన కూటమి నాయకులు

గాండ్లపెంట : మండల ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె.క్రాంతిని గురువారం కూటమి నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. నాయకులు మాట్లా డుతూ మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించాలని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని కోరారు. ఎస్ఐను కలిసిన వారిలో దొనకొండ ఆనంద్, ఎస్.అక్రమ్‌బాషా, సోమశేఖర్‌రెడ్డి, రియాజ్, రవీంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

గుడిబండ : మండలంలోని ఎస్.రాయపురం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచి ఇస్మాయిల్ కుమారుడు సద్దాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి గురువారం ఎస్.రాయపురం గ్రామం వెళ్లి ఇస్మాయిల్ కుటుంబ సభ్యులను, సద్దాం భార్య, పిల్లలను పరామర్శించారు. సద్దాం నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుండే వారని, పార్టీలకు తీతంగా అందరితో సఖ్యతగా ఉండేవారని, అలాంటి వ్యక్తి ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. మీకు టిడిపి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రైతులకు జిప్సం పంపిణీ

ప్రజాశక్తి-అమరాపురం

స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు జిప్సం పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మంజునాథ్, టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి తెలిపారు. వారు మాట్లాడుతూ హలుకూరు, గౌడకుంట, అమరాపురం గ్రామాలను జిప్సం రాగా 200 బ్యాగులు పంపిణీ చేశామని తెలిపారు. అవసరం ఉన్న రైతులు జిప్సం తీసుకుపోవాలని సూచించారు. అవసరమైతే మరింత జిప్సం తెప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జి రాఘవేంద్ర, మోహన్, నాగరాజు, మాలింగప్ప, రఘు, డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు హనుమంతరాయుడు, తమ్మడేపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

'చినుకు పడితే చిత్తడే'..!

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పెద్దఎత్తున గ్రామ గ్రామాన సీసీ రోడ్లు వేశామని ప్రతి సభ, సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి మంత్రులు, కూటమి ఎంపిలు, ఎమ్మెల్యేలు ఊదరగొడుతుంటారు. అయితే చాలా గ్రామాల్లో నేటికీ చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు బురదమయమై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు ఈ చిత్రాలే నిదర్శనం

అమరాపురం : మండల కేంద్రానికి ఆమడదూరంలో కర్నాటక సరిహద్దులో ఉన్న కొర్రేవు గ్రామంలో బురదమయమైన రహదారి

హిందూపురం : లేపాక్షి మండలం చోళసముద్రం పంచాయతీ పరిధిలోని నాగనపల్లి గ్రామంలో రోడ్ల దుస్థితి

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-పెనుకొండ

సమావేశంలో మాట్లాడుతున్న శివరామకృష్ణ

పిపిపి పేరుతో రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ డిమాండ్ చేశారు. పిపిపి విధానంతో భవిష్యత్తులో మెడికల్ ఎమర్జెన్సీ వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాల యం ముందు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఓ వైపు సంక్షేమం, అభివృద్ధి పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, మరో వైపు నిధుల కొరత పేరుతో వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం పేద, మధ్యతరగతి ప్రజలను మోసం చేయడమే అన్నారు. వైద్య కళాశాల లను ప్రయివేటు పరం చేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందని ద్రాక్ష అవుతుందన్నారు. పేద ప్రజల పిల్లలు డాక్టర్ కావాలని కల కలగానే మిగిలిపోయే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

తలుపుల వైసిపి మండల కన్వీనర్‌గా డికె.బాబు

ప్రజాశక్తి-తలుపుల

వైసిపి మండల నూతన కన్వీనర్‌గా డి.కృష్ణారెడ్డి(డికె.బాబు)ని నియమించినట్లు గురువారం కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బిఎస్ మక్బూల్ తెలిపారు. నూతన మండల కన్వీనర్ డికె.బాబుకు మక్బూల్, పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులు డికె.బాబుకు సహకరించి మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మక్బూల్ సూచించారు.

పాఠశాలల్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

తనకల్లు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం ఎంపిపి ఎర్రవీర కౌసల్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో జనసేన పార్టీ బాలసముద్రం ఎంపిటిసి సభ్యుడు అమర్ కార్తికేయ బాలసముద్రం గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా గోవిందువారిపల్లె, సిబిఎన్ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ప్రతి సోమవారం కొక్కంటి క్రాస్‌లో జరిగే వారపు సంత రోజున ఒక పోలీసు కానిస్టేబుల్‌ను నియమించాలని, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు విన్నవించారు. గత ప్రభుత్వంలో 'జలకళ' పథకం కింత వేసిన నీటి బోర్ల వివరాలు తెలపాలని కోరారు. సమావేశంలో ఎంపిపి ఎర్రవీర కౌసల్య, ఎంపిడిఒ రామానాయక్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మండల అధికారులు పాల్గొన్నారు.

డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు

లేపాక్షి : నిత్యావసర సరుకుల పంపిణీలో రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. సిఎస్‌డిటి మోహన్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేసే నిత్యావసర సరుకులను డీలర్లు రేషన్ కార్డుదారులకు సక్రమంగా అందించాల న్నారు. స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీపై ఆరా తీశారు. ఇప్పటి వరకూ 14,176 రేషన్ కార్డులు మంజూ రు కాగా 12,635 కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగతా వాటిని సకాలంలో లబ్ధిదారులకు అందించాలని తహశీల్దార్ ఆదేశించారు.

వేతనాలు చెల్లించాలని వినతి

పుట్టపర్తి రూరల్ : ప్రతి నెలా సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు డ్వామా ఇన్‌ఛార్జి పిడి శ్రీలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్ నెల వేతనం ఇప్పటి వరకూ అందలేదన్నారు. కొందరికైతే 4 నెలల నుంచి వేతనం అందలేదన్నారు. దీంతో కుటుంబ పోషణ భారమైంద న్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి బకాయి వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు అందరికీ ప్రతి నెలా సక్రమంగా వేతనాలు ఇవ్వాలని కోరారు.

వాహనాల తనిఖీ

ముదిగుబ్బ : మండలంలోని పులివెందుల రోడ్డులో గురువారం సిఐ శివరాముడు పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించని కొందరికి అపరాధ రుసుము విధించారు. మద్యం తాగి, లైసెన్స్ లేకుం డా వాహనం నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

కొమరం భీమ్‌కు నివాళి

కదిరి అర్బన్ : స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీమ్ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జై భీమ్ అసోసియేషన్ సభ్యులు, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నాయకులు గణేష్, సిపిఎం నాయకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొత్తచెరువు : స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-17 హాకీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం గోపాల్, పిఈటి వెంకటేష్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులు నవదీప్, సాధిక్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటారని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన నవదీప్, సాధిక్‌తో ఉపాధ్యాయులు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా రేపాకుల రామయ్యు మరియు యన్.ఆదినారాయణ అను మేము ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రేణిగుంట్ల వెంకటరత్నం మరియు యంగాలశెట్టి రాజు మీద క్రింది కనపరిచిన షెడ్యూల్ ఆస్తిపై కేసు వేయడం జరిగింది కేసు నెంబరు I.P.12/2020 SCI Court ధర్మవరం కావున క్రింది కనపరిచిన ఆస్తిని పైన తెలిపిన యంగాల శెట్టి రాజు నుంచి కొన్న యెడల అది చెల్లదు ఎవరైన కొన్న యెడల వారిపై చట్టరీత్యా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు

Property Situated in Gotluru Revenue Village Feilds of Dharamvaram Mandal and Within S.R.D of Dharmavaram and R.D of Hindupur

Nature	Sy.No.	Sy.No.	Remarks
Govt. Dry.	453-1B	A.C 2-48 Cents Out of it 1/2 Share Out of 1/4 Share i.e.,0-31 Cents	i.e. A.C 1-24Cents

Bounded By:-
East: Land of Kristaiah and his Other Brothers,
South: Land of Renukuntla and VenkataSubbaiah.
West: Tadipatri Road,
North: Land of Kristaiah and his Other Brothers.

జి.నాగరాజు,
అడ్వకేట్, ధర్మవరం

IN THE COURT OF THE CIVIL JUDGE, (SENIOR DIVISION); PENUKONDA

I.A. 375/2025 in I.A. 279/2024 in O.S.118/2015
I.A.376/2025 in I.A. 207/2024 in O.S. 118/2015
I.A.377/2025 in I.A. 278/2024 in O.S. 118/2015

Between:

H.Fazulunnisa ...Petitioner-Plaintiff

AND

H.A.Jabbar and Others ...Respondents-Defendants

పై నెంబరు దావాలోని అర్జీలోని ప్రతివాదులకు నోటీసు

I.A.375/2025 in I.A.279/2024 లో 16వ ప్రతివాదికి నోటీసు

To R16 - Krishnaveni D/o Late Anjinappa, Veternary Health Assistant, Gollapalli Sachivalayam R/o B.C.Colony, Gollapalli (V), Parigi Mandalam, Hindupur Taluk.

I.A.376/2025 in I.A. 207/2024 లోని 11,12,14, 16,17 ప్రతివాదులకు నోటీసు

R11- K.Alivelamma, D/o K.Muneppa, Gollapalli (V), Parigi Mandalam, Hindupur Taluk, Satya Sai District.

R12- Varalakshmi, D/o K.Muneppa, Gollapalli (V), Parigi Mandalam, Hindupur Taluk

R14- Latha @ Lalitha, D/o K.Muneppa, Gollapalli (V), Parigi Mandalam, Hindupur Taluk

R16- Krishnaveni D/o Late Anjinappa, Veternary Health Assistant, Gollapalli Sachivalayam R/o B.C.Colony, Gollapalli (V), Parigi Mandalam, Hindupur Taluk.

R17- Krishtappa S/o Kollapuram Venkatamanappa, B.C.Colony, Gollapalli (V), Parigi Mandalam, Hindupur Taluk.

I.A.377/2025 in I.A. 278/2024 in O.S. 118/2015 లో 11వ ప్రతివాదికి నోటీసు

To R11- K.Alivelamma, D/o K.Muneppa, Gollapalli (V), Parigi Mandalam, Hindupur Taluk, Satya Sai District.

యిందుమూలకముగా మీకు తెలియచేయడమేమనగా పై నెంబరు దావాలోని I.Aలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చుటకు గాను పై అర్జీలను దాఖలు చేసినారు. సదరి విషయముపై మీకు ఏమైనా అక్షేపణలువున్న ఎడల మీరు పై కోర్టులో 4-11-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు ఖుద్దున గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలెయును. లేని ఎడల మీ పరోక్షమందు ఐ అర్జీలను తీర్మానము చేయుదురని యిందుమూలకముగా మీకు తెలియచేయడమైనది.

(By order of the court)

శ్రీ.G.మదన్‌మోహన్ రెడ్డి,
అర్జీదారుల పరం వకీలు, పెనుకొండ